క్లుప్తంగా

నాగంపేట్‌వాసికి పూలే అవార్డు

బాల్కొండ: నాగంపేట్ గ్రామానికి చెందిన విక్రమ్ మహాత్మాజ్యోతిబా పూలే జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి జాతీయ స్థాయిలో అవార్డును ప్రకటిస్తారు. అందులో భాగంగా 2024–25 సంవత్సరానికి విక్రమ్ ఎంపికైనట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు రాధా కృష్ణ తెలిపారు. జూన్ 16న మహారాష్ట్రలో అవార్డు అందుకుంటాడన్నారు.

మేట్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు

వర్ని: సత్యనారాయణపురం గ్రామంలో ఉపాధి హామీ మేట్ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ సోమవారం కూలీలు వర్ని ఎంపీడీవో వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతిరోజు ఉపాధి కూలి చేసే వారికి తక్కువ కొలతలు చేస్తున్నాడని మేట్‌కు అనుకూలంగా ఉన్నవారికి పనికి రాకున్నా హాజరు వేస్తున్నాడని ఫిర్యాదులో కూలీలు పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న మేట్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కూలీలతో పాటు వర్ని మండల బీజేపీ అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు

మాక్లూర్: మండల కేంద్రంలో సోమవారం మండల పశువైద్యాధికారి ఉమా సహేర్ ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది గొర్రె, మేకలకు చిటుకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గ్రామాల వారీగా శిబిరాలు నిర్వహించి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నందున మండలంలోని అన్ని గ్రామాల గొర్రె, మేకల పెంపకందారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమా సహేర్ సూచించారు. పశువైద్య సిబ్బంది వినీత, అహ్మద్‌పాషా, సుధీర్, జైల్‌సింగ్, శ్రీనివాస్, గంగాధర్, పుష్ప, లక్ష్మి పాల్గొన్నారు.

కొత్త వేతనాలు ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్: బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం నూతన వేతనాలు బీడీ కంపెనీ యజమానులు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ ప్యాకింగ్, ట్రేఫిల్లర్స్, క్లర్క్, బీడీలు చుట్టే కార్మికులకు నూతన ఒప్పందం ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు.

నిరుపేదలకు అన్నదానం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపల్ కార్మికుడు రవి తన తండ్రి సాయన్న జ్ఞాపకార్థం పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి రమేష్ పవార్, కాంగ్రెస్ నాయకులు అశోక్ రోడే తదితరులున్నారు.

విద్యుత్ పునరుద్ధరణ

రుద్రూర్: ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సరాఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించడంలో ట్రాన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. కేవలం 15 నిమిషాల పాటు వీచిన గాలులకు సుమారు మండల వ్యాప్తంగా ఐదు ట్రాన్స్‌ఫార్మర్‌లు, 33కేవీ, 11కేవీకి సంబంధించిన రెండు వందల విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ సిబ్బంది ఆదివారం సాయంత్రం నుంచి ఇప్పటి వరకు దాదాపుగా అన్ని గ్రామాల్లో గృహాలకు సంబంధించి విద్యుత్ సరాఫరా పూర్తి చేశారు. వ్యవసాయ కనెక్షన్‌లకు సరాఫరా పునరుద్ధరించాల్సి ఉంది.

ఆర్థిక చేయూత

రుద్రూర్: పొతంగల్ మండలం జల్లాపల్లి ఆబాదిలో నిరుపేద కుటుంబాలకు సోమవారం మాజీ కో– ఆప్షన్ సభ్యుడు హకీం ఆర్థిక చేయూతను అందించారు. ఆబాదీకి చెందిన తారాచంద్ మృతితో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల రేకులు ఎగిరిపోయి నిరాశ్రయులైన బాబు, ఫకీరా, గోవింద్ కుటుంబాలకు ఆయన రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఘనంగా ఊర పండుగ

నందిపేట్(ఆర్మూర్): లక్కంపల్లి గ్రామంలో సోమవారం ఊర పండుగను గ్రామప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను ఎత్తుకుని గ్రామ దేవతలను డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామదేవతలకు నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే బర్ల పండుగను నిర్వహించారు.

రైతులకు అవగాహన

ఎడపల్లి(బోధన్): మేలురకం పంట విత్తనాలను ఎంపిక చేసుకొని రైతులు అధిక దిగుబడులను సాధించాలని మండల వ్యసాయ అధికారి రామేశ్వరం అన్నారు. సోమవారం జైతాపూర్, దున్నతండా గ్రామాల్లాలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రేపు సర్వసభ్య సమావేశం

వర్ని: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్ తెలిపారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరుకావాలని కోరారు. గైర్హాజరైన అధికారులకు శాఖా పరమైన చర్యలకు సిఫారసు చేస్తామని తెలిపారు.

బడుల్లో పనులు పూర్తయ్యేనా?

- నత్తనడకన సాగుతున్న వైనం
- కొన్ని పాఠశాలలో ఇంకా ప్రారంభం కాని పనులు
- విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి కావడం కష్టమే



బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సాగుతున్న పనులు

బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ప్రవేశ పెట్టింది. పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పనులను విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలని సూచించింది. కాని క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా సాగుతుంది. బాల్కొండలో 16 పాఠశాలలు, ముప్కాల్‌లో 11 పాఠశాలలు, మెండోరా మండలంలో 15 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఎంపికయ్యాయి. అందులో బాల్కొండ మండలంలో 12 పాఠశాలలు, ముప్కాల్ మండలంలో 9 పాఠశాలలు, మెండోరా మండలంలో 12 పాఠశాలల్లో మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. మిగతా పాఠశాలల్లో పనులు ప్రారంభం కాలేదు. అసలు పనులు ప్రారంభమవుతాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. మరో పక్షం రోజులు గడిస్తే పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. కాని పనులు అప్పటి వరకు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ప్రధానంగా పాఠశాలలో విద్యుత్తు పునరుద్ధరణ పనులు, మూత్రశాలలు, మరుగు దొడ్లకు నీటి సౌకర్యం లాంటి పనులు చేయాల్సి ఉంది. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా కొన్ని పాఠశాలలకు ఎక్కువ నిధులు, మరి కొన్ని పాఠశాలలకు తక్కువ నిధులు మంజూరయ్యాయి. పనులు సకాలంలో ప్రారంభించి, సకాలంలో పూర్తి చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఉండేవి కాదు. ప్రస్తుతం చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి కాకుంటే విద్యార్థులు బడికి వెళ్లాలంటే కూడా ఇబ్బంది అవుతుంది. ఉన్నత అధికారులు నిత్యం పనులను వెంటనే పూర్తి చేయాలని హెచ్చరిస్తున్నారు. కాని క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరైన నిధుల్లో ఇది వరకు 10 శాతం నిధులు డ్రా చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినట్లు అధికారులు తెలిపారు. కాని పనులు మాత్రం అంత వేగంగా సాగడం లేదు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపడుతున్న పనులు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని పాఠశాలల్లో పనులు వేగంగా సాగుతున్నాయి. మిగతా పాఠశాలల్లో కూడా వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. – రాజేశ్వర్, ఎంఈవో, బాల్కొండ

పోరాటాల ఫలితంగానే వేతనాల పెంపు



జన్నేపల్లిలో సంబురాలు చేసుకుంటున్న కార్మికులు



పొతంగల్‌లో మాట్లాడుతున్న రాజేశ్వర్

నవీపేట: తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం చేపట్టిన వరుస ఆందోళనలతోనే బీడీ పరిశ్రమలోని కార్మికులకు వేతనాలు పెరిగాయని బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రాములు పేర్కొన్నారు. నవీపేట, జన్నేపల్లి గ్రామాలలోని బీడీ పరిశ్రమలోని కార్మికులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిరాములు మాట్లాడారు. వేతన ఒప్పందం గత ఏప్రిల్‌తో ముగియగా బీడీ కార్మిక సంఘాల ప్రతినిధులతో బీడీ యాజమాన్యాలు చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సయ్యద్, నవాబ్, గంగాధర్, నర్సయ్య, ప్రమీల పాల్గొన్నారు.

పొతంగల్‌లో...

బీడీ కార్మికులకు వేతనాల పెంపుపై తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పోతంగల్ గ్రామంలోని దేశాయి బీడీ కంపెనీలో సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్ మాట్లాడారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన వరుస ఉద్యమాలతోనే బీడీ యజమాన్యాలు చర్చలకు వచ్చారని, డిమాండ్లను అంగీకరించారని పేర్కొన్నారు.నాయకులు నగేష్, సుదర్శన్, షేర్‌ఖాన్, గౌస్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమి సర్వే



నందిపేట్(ఆర్మూర్): తల్వేదలో వివాదాస్పద భూమిని సోమవారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. కాకయ్య గుడికి సంబంధించి సర్వే నంబరు– 403/1లోని 0.03 గుంటలతో పాటు సర్వే నంబరు 403/2లోని ఎకరం భూమి కబ్జాకు గురైనట్లు గ్రామ యువకులు ఎండోమెంట్ శాఖకు ఫిర్యాదు చేశారు. వారి అభ్యర్థన మేరకు ఎండోమెంట్, సర్వే డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. సర్వే చేసిన నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తహసీల్దార్ ఆనంద్ తెలిపారు.

సాలూర తహసీల్దార్‌తో రైతుల వాగ్వాదం

- చెరువు కట్టపై దారికి మొరం కోసం రైతుల వినతి
- నిరాకరించిన తహసీల్దార్ రమేష్
- రైతులకేనా ఆంక్షలు.. ఇసుక, మొరం అక్రమ రవాణాపై చర్యలేవని తహసీల్దార్‌ను ప్రశ్నించిన రైతులు



తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న రైతులు

బోధన్: సాలూర మండల కేంద్రంలోని నిండు చెరువు కట్టపై దారిని ఏర్పాటు చేసుకునేందుకు తమ పట్టా భూముల్లో మొరం తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ రమేష్‌ను సాలూర గ్రామ రైతులు కోరారు. తహసీల్దార్ నిరాకరించారు. దీంతో తహసీల్దార్, గ్రామ రైతులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. చెరువు కట్టపై ముళ్ల పొదలను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా శుభ్రం చేశామని, మొరంతో చదును చేసి దారి ఏర్పాటు చేసుకుంటే పంట పొలాలకు వెళ్లేందుకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. మొరం కోసం ఆర్డీవో ద్వారా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ తెలిపారు. దాంతో రైతులు వాగ్వాదానికి దిగారు. మొరం కోసం రైతులకైతే అనుమతులు, ఆంక్షలు విధిస్తున్నారని, అక్రమంగా ఇసుక, మొరం తవ్వకాలు చేపట్టి రవాణాకు పాల్పడుతున్నా అక్రమార్కులపై ఏమి చర్యలు తీసుకుంటున్నారని రైతులు ప్రశ్నించారు. పంట పొలాలకు వెళ్లే సందర్భంలో అదుపు తప్పితే చెరువులోకి దూసుకుపోయి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందని, సమస్య తీవ్రతను గుర్తించి ఆర్డీవో మొరం కోసం అనుమతులు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని వెల్లడించారు. రైతులు గంగారాం, బుద్దె లక్ష్మణ్, ముట్టెన్ ప్రకాష్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన



పాండు ఫారం కాలనీలోని పాఠశాలను పరిశీలిస్తున్న కమిషనర్



నూత్‌పల్లి గురుకుల పాఠశాలలో టాయిలెట్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్ రావు



నాగాపూర్‌లో పాఠశాల పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయగౌడ్

మాక్లూర్/బోధన్ టౌన్/డొంకేశ్వర్/కమ్మర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపడుతున్న పనులను పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను వారు తనిఖీ చేశారు. సమస్యలను విద్యార్థులు వచ్చేలోగా పరిష్కరించాలని సూచించారు. తల్లితండ్రులు వారి పిల్లలను గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలకే పంపించాలని కోరారు. మాక్లూర్ మండలం ధర్మోరా అమ్మ ఆదర్శ పాఠశాలను ఎంపీవో టి. శ్రీనివాస్, ప్రత్యేక అధికారి ముత్తెన్న, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, బోధన్ పట్టణంలోని నర్సాపూర్, పాండు ఫారం ప్రభుత్వ పాఠశాలలను మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి బీసీ గురుకుల పాఠశాలను జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, కమ్మర్‌పల్లి మండలంలోని నాగాపూర్, కమ్మర్‌పల్లి, హాసకొత్తూర్, బషీరాబాద్, కేసీ తండా, వీజే తండా, ఇనాయత్ నగర్, నర్సాపూర్, కోనసముందర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను డీఆర్‌డీవో సాయగౌడ్ పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పంటలకు నిప్పు.. ప్రయాణికులకు ముప్పు



నాగంపేట్ శివారులో పెద్ద వాగు రోడ్డు పక్కన పంటల వ్యర్థాలకు పెట్టిన నిప్పు

బాల్కొండ: పంటల వ్యర్థాలకు రోడ్డు పక్కన నిప్పు పెట్టడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముప్కాల్ మండలం నాగంపేట్ శివారులో పెద్ద వాగు రోడ్డు పక్కన గల పంటల వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వారి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పొగకారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనపడటం లేదు. అలాగే పొగలో నుంచి పోయే ప్రయాణికులకు ఊపిరాడక చనిపోయే ప్రమాదం కూడా ఉంది. ఇలా నిప్పు పెడుడూ ప్రమాదాలకు కారణమవుతున్నా వారిపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మహిళా సంఘాలకు అవగాహన



భీమ్‌గల్: మండలంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఏపీఎం రవీందర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం రవీందర్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫామ్‌లను మహిళా శక్తి టైలరింగ్ సెంటర్ల ద్వారా కుట్టించాలన్న ప్రభుత్వం ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

పంటల సాగుపై అవగాహన

మాక్లూర్: రానున్న వర్షాకాల పంటల సాగుతో పాటు విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లపై తీసుకోవాల్సిన జాగ్రతలను మండల వ్యవసాయ అధికారి పద్మ రైతులకు వివరించి చెప్పారు. సోమవారం బోర్గాం(కె), సింగంపల్లి, గొట్టిముక్కల, గుంజ్లి, కొత్తపల్లి, అమ్రాద్, మాణిక్‌భండార్, చిన్నాపూర్, అడవి మామిడిపల్లి గ్రామాలలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు బిల్లు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు కూడా లభ్యమవుతున్నాయని చెప్పారు. కొందరు రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసి నారు కూడా పోసుకున్నందున నారు ఎండిపోకుండా తగు జాగ్రతలు పాటించాలన్నారు. అనంతరం మాణిక్‌భండార్, మాక్లూర్ గ్రామాల్లోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉషారాణి

నవీపేట: మహిళా సంఘాలకు బ్యాంకులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా సమాఖ్య మండల అధ్యక్షులు ఉషారాణి సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.67 కోట్ల 32 లక్షల రుణాలు పంపిణీ చేసేందుకు బ్యాంకులు సానుకూలంగా ఉన్నాయన్నారు. నిర్ణీత సమయంలో మహిళా సంఘాలకు రుణాలను పంపిణీ చేస్తామన్నారు. తీసుకున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలపై అవగాహన కల్పించారు. ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, సీసీలు, వీవోలు పాల్గొన్నారు.

రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి



దత్తాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఈవో మౌనిక



సాటాపూర్‌లో .. ఏఈవో లక్ష్మీకాంత్ రెడ్డి



గోవింద్‌పేట్‌లో ..



రామన్నపేట్‌లో.. ఏవో నర్సయ్య

డొంకేశ్వర్/రెంజల్/పెర్కిట్/వేల్పూర్/మోర్తాడ్, కమ్మర్‌పల్లి: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవోలు రైతులకు సూచించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. సీడ్స్ దుకాణాలకు వెళ్లినప్పుడు లూజు విత్తనాలు కొనుగోలు చేయవద్దని, లేబుల్ ప్రింట్, ధర, అడ్రస్ ఉన్న ప్యాకెట్లను మాత్రమే కొనాలన్నారు. కొనుగోలు చేసిన సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకుని పంట చేతికి వచ్చేదాకా జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే వెంటనే మాకు సమాచారం అందించాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి లైసెన్సు కలిగిన డీలర్లను మాత్రమే సంప్రదించాలన్నారు. పంటలు సాగు చేసే ముందు స్థానిక వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు.





మోర్తాడ్: తనిఖీ చేస్తున్న ఏవో లావణ్య.. దొన్కల్‌లో రైతులతో సమావేశమైన అధికారులు



హాసాకొత్తూర్‌లో .. ఏవో అబ్దుల్ మాలిక్

మొక్కల సంరక్షణ బాధ్యతగా నిర్వహించాలి



రెంజల్(బోధన్): మొక్కల సంరక్షణ బాధ్యతను కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. వీరన్నగుట్ట తండా గ్రామంలోని నర్సరీని సోమవారం సందర్శించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాల్సి ఉంటుందని సూచించారు. ప్రతి మొక్కను బతికించుకునేందుకు ప్రయత్నించాలన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఫ్యూరియోసా (తెలుగు) - 12.25, రాజుయాదవ్ (తెలుగు) - 3.40, 6.20, 9.00
స్క్రీన్-3 –	లవ్‌మీ (తెలుగు) - 11.50, ఫ్యూరియోసా (తెలుగు) - 02.45, 6.00, 9.15
స్క్రీన్-4 –	లవ్‌మీ (తెలుగు) - 1.30, 4.25, 7.20, 10.15

సంక్షిప్తం

పాఠశాల పరిశీలన

ఎడపల్లి(బోధన్): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధిరిణీ నందకుమారి సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు.

సారంగాపూర్ హనుమాన్ ఆలయానికి పాదయాత్ర

వర్ని: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పోతిరెడ్డిపల్లి హనుమాన్ ఆలయం నుంచి నిజామాబాద్ మండలం సారంగాపూర్ శివారులో ఉన్న హనుమాన్ ఆలయం వరకు భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. ఈనెల 26న గురుస్వామి తేజ స్వామి ఆధ్వర్యంలో హనుమాన్ భక్తులు 60 కిలోమీటర్ల పాదయాత్రకు శ్రీకారం చుట్టారని, 28న నిజామాబాద్ శివారులోని హనుమాన్ ఆలయం వరకు చేరుకొని మొక్కులు తీర్చుకుంటారు. పాదయాత్ర సోమవారం వర్ని, చందూర్, మోస్రా మండలాల మీదుగా కొనసాగింది. చందూరు మండల కేంద్రంలో హనుమాన్ మాలధారణ స్వాములు, పాదయాత్ర భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రమేష్ నాయక్, కొత్తోళ్ల అశోక్ రెడ్డి, మద్దూరి శంకర్ రెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై పల్లకీ సేవ

ఆర్మూర‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని నవ నాథ సిద్దుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకీ సేవ నిర్వహించారు.

నెహ్రూకు ఘన నివాళులు



డొంకేశ్వర్(ఆర్మూర్): భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని సోమవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు గొడిశరం భూమేశ్ రెడ్డి, ఇతర నాయకులు స్థానిక నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుకు చేసుకున్నారు.

ఎస్సారెస్పీ కార్యాలయం వద్ద..

బాల్కొండ: నెహ్రూ వర్ధంతిని సోమవారం శ్రీరాసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సారెస్పీ నిర్మాణం కోసం ఆయన 1963లో శంకుస్థాపన చేసిన రోజులను గుర్తు చేశారు. చక్రపాణి, డిప్యూటీ ఈఈ గణేష్, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.